క్లుప్తంగా

అగ్ని ప్రమాద బాధితులకు సాయం



బాధితులకు వస్త్రాలు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ తదితరులు

పూసపాటిరేగ: మండలంలోని పతివాడ పంచాయతీ కామునాయుడుపేటలో జరిగిన అగ్ని ప్రమాద బాధితులకు రెడ్‌క్రాస్ సొసైటీ సహకారంతో నగదు, వస్త్రాలను మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ తాడ్డి గోవింద మాట్లాడుతూ ప్రమాదంలో సర్వం కోల్పోయిన బాధితులు అందరూ మనో ధైర్యంతో ఉండాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పతివాడ అప్పలనాయుడు, సర్పంచ్ ఆకుల పైడిరామ్, జమరాజు తదితరులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాలతో నేర నియంత్రణ



కొండగుంపాం రామాలయం వద్ద మాట్లాడుతున్న ఎస్‌ఐ గణేష్

నెల్లిమర్ల రూరల్: నేరాల నియంత్రణకు ప్రతి గ్రామంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని ఎస్‌ఐ గణేష్ పిలుపునిచ్చారు. మండలంలోని కొండగుంపాంలో ఉన్న వివిధ ఆలయాల్లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలను మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ మాట్లాడుతూ దేవాలయాలు, ఇతర మతపరమైన పవిత్ర స్థలాల పరిరక్షణలో భాగంగా సీసీ కెమెరాలను ఏర్పాటు చేయిస్తున్నామన్నారు. గ్రామాల్లో ఉన్న ఆలయాలు, చర్చిలు, మసీదుల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటుకు గ్రామ పెద్దలు, యువత సహకరించాలన్నారు. సీసీ కెమెరాల ఏర్పాటుతో నేరాల నియంత్రణ సులభతరమవుతుందన్నారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, యువత పాల్గొన్నారు.

గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలి



ర్యాలీ చేస్తున్న అంగన్‌వాడీలు

విజయనగరం ఫోర్ట్: గర్భిణులు పౌష్టికాహారం తీసుకోవాలని ఐసీడీఎస్ సూపర్ వైజర్ బి.అనురాధ అన్నారు. పోషణ్ పక్వాడా కార్యక్రమంలో భాగంగా మంగళవారం విటి.అగ్రహారం హైస్కూల్ వద్ద అంగన్‌వాడీలు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా రక్తహీనత బారిన పడకుండా ఉండవచ్చునన్నారు.

క్యాంపస్ డ్రైవ్‌కి స్పందన

విజయనగరం అర్బన్: పట్టణంలోని సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాలలో దక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ మంగళవారం నిర్వహించిన పూల్ క్యాంపస్ డ్రైవ్‌కు విశేష స్పందన లభించింది. సంస్థలోని ఖాళీగా ఉన్న ప్రొడక్షన్ విభాగంలో ట్రైనీ కెమిస్ట్ పొజిషన్ పోస్టు కోసం వివిధ ప్రాంతాల నుంచి 100 మంది వరకు విద్యార్థులు హాజరయ్యారని ఆ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీ సాయిదేవమణి తెలిపారు. రాతపరీక్ష, టెక్నికల్ రౌండ్ మరియు ఇంటర్వ్యూల ప్రక్రియలు పూర్తయిన తరువాత 13 మంది ఎంపికయ్యారని తెలిపారు. ఎంపిక ప్రక్రియలో దక్కన్ ఫైన్ కెమికల్స్ ప్రైవేటు లిమిటెడ్ సంస్థ మేనేజర్ హరిబాబు, హెచ్ఆర్ అలేఖ్య పాల్గొన్నారు.

నేడు ప్రకృతి విపత్తులపై మాక్‌డ్రిల్

భోగాపురం: తుఫాన్‌లు వంటి ప్రకృతి వైపరీత్యాలను ఎదుర్కొనే విషయమై ప్రజల్లో అవగాహన కలిగించేందుకు ప్రభుత్వ శాఖల సమన్వయంతో మండలంలోని చేపలకంచేరు గ్రామంలో బుధవారం ఉదయం 9 గంటలకు మాక్‌డ్రిల్ నిర్వహించనున్నట్లు విపత్తుల నిర్వహణ శాఖ జిల్లా ప్రాజెక్టు అధికారి ఎం.రాజేశ్వరి మంగళవారం తెలిపారు. ఏపీ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ సూచనలతో చేపలకంచేరులోని సచివాలయం వద్ద గల ఎంపీయూపీ స్కూల్ ఆవరణలో బుధవారం అన్ని ప్రభుత్వ శాఖల ఆధ్వర్యంలో మాక్‌డ్రిల్ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఏపీ ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలతో ప్రజలకు విపత్తులను ఎదుర్కొనే విషయమై తగిన అవగాహన కల్పించనున్నట్లు తెలిపారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ ఆదేశాల మేరకు డీఎస్సీ ఎస్జీటీ, స్కూల్ అసిస్టెంట్ అన్ని సబ్జెక్టుల పరీక్షలకు అర్హులైన జిల్లాకు చెందిన బీసీ, ఈడబ్ల్యూఎస్ (ఈబీసీ), ఎస్సీ, ఎస్టీ వర్గాలకు చెందిన అభ్యర్థుల నుంచి ఆన్‌లైన్ ఉచిత శిక్షణ కోసం దరఖాస్తులు కోరుతున్నామని గురజాడ అప్పారావు బీసీ స్టడీ సర్కిల్ డైరెక్టర్ జె.జ్యోతిశ్రీ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉచిత శిక్షణకు అభ్యర్థుల నుంచి నేరుగా దరఖాస్తులు స్వీకరిస్తున్నామన్నారు. వివరాలకు 9603557333, 9177726454 నంబర్లను సంప్రదించాలని కోరారు.

ప్రజలకు మెరుగైన సేవలందించాలి

• కార్పొరేషన్ కమిషనర్ నల్లనయ్య



అధికారులతో సమీక్షిస్తున్న కమిషనర్

విజయనగరం: ప్రభుత్వం నిర్దేశించిన వార్షిక కార్యాచరణ ప్రణాళికను అనుసరించి ఉత్తమ సేవలను అందించాలని విజయనగరం కార్పొరేషన్‌లోని వివిధ విభాగాల అధికారులకు కమిషనర్ పల్లి నల్లనయ్య ఆదేశించారు. తన చాంబర్‌లో అన్ని విభాగాల అధికారులతో వివిధ అంశాలపై మంగళవారం సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రూపొందించిన వార్షిక కార్యాచరణ ప్రణాళిక వివరాలను వివరించారు. ప్రధానంగా వేసవి కాలంలో ఎక్కడా నీటి కోసం ఖాళీ బిందెల ప్రదర్శనలు జరగకుండా చూడాలన్నారు. కలుషిత నీరు పంపిణీ లేకుండా జాగ్రత్త వహించాలన్నారు. నీటి పంపిణీ వేళలను నిర్దిష్టంగా పాటించాలన్నారు. ప్రజారోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని శతశాతం ఇంటింటి చెత్త సేకరణ జరగాలన్నారు. ఎక్కడ చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. వాణిజ్య ప్రాంతాలలో ప్రతి 50 మీటర్ల నిడివిలో ఒక చెత్తబుట్ట ఉండే విధంగా ఏర్పాట్లు చేయాలన్నారు. అన్నా క్యాంటీన్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలని చెప్పారు. పురమిత్ర యాప్‌ను ప్రతి ఒక్కరు నిక్షిప్తం చేసుకునే విధంగా చొరవ చూపాలన్నారు. వివిధ రకాల పన్నుల వసూళ్లను ముమ్మరం చేయాలని రెవెన్యూ అధికారులకు ఆదేశించారు. నిబంధనలు అతిక్రమించి చేపట్టిన భవన నిర్మాణాలు, అనధికార భవనాలను ఉపేక్షించవద్దని ప్రణాళిక అధికారులకు ఆదేశించారు. సమావేశంలో ప్రజారోగ్య అధికారి డాక్టర్ కొండపల్లి సాంబమూర్తి, రెవెన్యూ అధికారి శ్రీనివాసరావు, అసిస్టెంట్ సిటీ ప్లానర్లు హరిబాబు, రమణమూర్తి, టీపీఆర్ఓ సింహాచలం, టౌన్ సర్వేయర్ సింహాచలం, సిటీ మిషన్ మేనేజర్ సన్యాసిరావు, డీఈలు మణికుమార్, శ్రీనివాసరావు, టీపీఎస్ అనిత తదితరులు పాల్గొన్నారు.

సనాతన ధర్మ పరిరక్షణ కోసం సైకిల్ యాత్ర



సతివాడ వద్ద సైకిల్ యాత్రికుడు రాము

నెల్లిమర్ల రూరల్: పశ్చిమగోదావరి జిల్లా భీమవరం మండలం గొల్లవానితిప్ప గ్రామానికి చెందిన యువకుడు సైకిల్‌పై కాశీ, కేదరీనాథ్ యాత్రకు పయనమయ్యాడు. నెల్లిమర్ల మండలం రామతీర్థం మీదుగా సతివాడ గ్రామానికి మంగళవారం చేరుకున్నాడు. సనాతన ధర్మ పరిరక్షణతో పాటు యువతను సన్మార్గంలో నడిపించాలనే లక్ష్యంతో సదరు యువకుడు వారం రోజుల కిందట తన సైకిల్ యాత్రను ప్రారంభించాడు. ఇప్పటి వరకు సుమారు 450 కిలోమీటర్లు సైకిల్‌పై ప్రయాణం చేశానని, గ్రామీణ ప్రాంతాల నుంచి సుమారు 3వేల కిలోమీటర్లు ప్రయాణం చేసి కాశీతో పాటు కేదరీనాథ్ పుణ్యక్షేత్రాలకు చేరుకుంటానని యువకుడు రాము సాక్షికి తెలిపాడు. హైవే నుంచి తక్కువ దూరంతో ప్రయాణించవచ్చని, అలా కాకుండా గ్రామీణ ప్రాంతాలను ఎంచుకుని సుదూర ప్రయాణం సాగిస్తున్నానన్నారు. రెండో సారి దిగ్విజయంగా సైకిల్ యాత్ర చేస్తున్నానని, రాత్రి సమయంలో పెట్రోల్ బంకుల వద్ద ఆశ్రయం పొందుతున్నానని చెప్పాడు.

ఒప్పందాలు అమలు చేయాలి

• జ్యూట్ మిల్లు కార్మికుల డిమాండ్

నెల్లిమర్ల: కార్మిక శాఖ అధికారులు వద్ద చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని జ్యూట్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు కిల్లంపల్లి రామారావు డిమాండ్ చేశారు. స్థానిక జ్యూట్ మిల్ గేటు వద్ద కార్మికులనుద్దేశించి ఆయన మంగళవారం మాట్లాడారు. జ్యూట్ యాజమాన్యం గత ఫిబ్రవరి 10న కార్మిక శాఖ అధికారుల వద్ద కార్మిక సంఘాలతో చేసుకున్న ఒప్పందాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యంగా గత ఆగస్టు, ఈ ఏడాది ఫిబ్రవరిలో అమలు జరిగిన డీఏ ప్రకారం కార్మికులకు వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. గతంలో జ్యూట్ యాజమాన్యం 2016 రిటైర్డ్ కార్మికులకు గ్రాడ్యూటీ చెక్‌లు ఇవ్వగా వాటిలో ఒకటి మాత్రమే చెల్లుబాటు అయ్యి, మిగతా చెక్‌లు చెల్లకుండా పోయాయి కాబట్టి వాటికి వెంటనే నగదు ఇవ్వాలని డిమాండ్ చేశారు. 2023 - 24 రిటైర్డ్ కార్మికుల నుంచి జ్యూట్ యాజమాన్యం వసూలు చేసిన ప్రభుత్వానికి చెల్లించాల్సిన పీఎఫ్, ఈఎస్ఐ బకాయిలు వెంటనే చెల్లించి రిటైర్డ్ కార్మికులకు పింఛన్, ఈఎస్ఐ సౌకర్యం కల్పనకు చర్యలు తీసుకోవాలని కోరారు. 2016 నుంచి ఇప్పటి వరకు రిటైర్డ్ కార్మికులు సుమారు 1200మంది ఉన్నారని వారికి నెలకు 30మందికి గ్రాడ్యూటీ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేశారు. పని చేస్తూ మృతి చెందిన కార్మికులు, మృతి చెందిన రిటైర్డ్ కార్మికులకు మొదటి ప్రాధాన్యత నిచ్చి గ్రాడ్యూటీ బకాయిలు చెల్లించాలని, జ్యూట్ యాజమాన్యం కార్మికుల నుంచి అప్పుగా తీసుకున్న రూ.5, రూ.10, రూ.18 బీఐఎఫ్ఆర్ కోర్టు కార్మికులకు తిరిగి వారికి ఇవ్వాలని, తీర్పు ప్రకారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్మికుల సమస్యలు పరిష్కరించకపోతే జ్యూట్ యాజమాన్యంపై కార్మికులతో ఉద్యమం హెచ్చరించారు. పలువురు కార్మికులు పాల్గొన్నారు.

భూసారంతో బహుళ ప్రయోజనాలు



నవధాన్యాల కిట్లను అందిస్తున్న సర్పంచ్ తదితరులు

డెంకాడ: నువ్వుల విత్తనాలతో పాటు నవధాన్యాల విత్తనాలను కలిపి వేయడం ద్వారా భూసారం పెరుగుతుందని ఏఈఓ బి.రామకోటి, ప్రకృతి వ్యవసాయ యూనిట్ ఇన్‌చార్జ్ బి.సుజాత అన్నారు. మండలంలోని సింగవరం గ్రామంలో రైతులతో అవగాహన కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. నువ్వులలో నవధాన్యాలు కలిపిన విత్తన కిట్‌లను సర్పంచ్ పిట్టా పద్మావతి చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నువ్వులతో నవధాన్యాలు కలిపి వేయడం వల్ల పంటకు కావాల్సిన పోషకాలు అందుతాయన్నారు. కూరగాయలు, ఆకుకూరలు వేయడం వలన కూరగాయల అవసరాలు తీరుతాయన్నారు. నేలకు కావాల్సినంత తేమ నిల్వ చేస్తుందన్నారు. భూమిలో సేంద్రీయ కార్బన్ శాతం పెరుగుతుందన్నారు. కార్యక్రమంలో ఐసీఆర్‌పీ ఎల్.స్వాతి, సచివాలయ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్యల పరిష్కారానికి కాల్ సెంటర్

విజయనగరం: నగరంలో సక్రమ నీటి పంపిణీకి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటున్నామని విజయనగరం కార్పొరేషన్ కమిషనర్ పల్లి నల్లనయ్య మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎక్కడైనా తాగునీటి పంపిణీలో సమస్యలు ఎదురైతే ప్రజలు తమకు నేరుగాగాని, కార్పొరేషన్ కార్యాలయం కాల్ సెంటర్ 98499 06486 నంబరుకుగాని సమాచారం అందిస్తే తక్షణమే సదరు సమస్య పరిష్కరించేందుకు తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు. అక్కడక్కడ ఏర్పడిన పైపులైను లీకేజీలను గుర్తించి యుద్ధ ప్రాతిపదికన మరమ్మతు పనులు చేపడుతున్నామని తెలిపారు. ప్రజా సమస్యలను, నీటి పంపిణీలో తలెత్తే ఇబ్బందులను కూడా సత్వర పరిష్కారానికి చొరవ చూపుతామని ఆయన స్పష్టం చేశారు.

మైనారిటీల అణిచివేతకే వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు

నెల్లిమర్ల: మైనారిటీలను అణిచి వేసేందుకే కేంద్రంలోని మోదీ ప్రభుత్వం వక్ఫ్ బోర్డు సవరణ బిల్లు తెచ్చిందని కాంగ్రెస్ పార్టీ నెల్లిమర్ల నియోజకవర్గ ఇంచార్జ్ గంటా సత్యనారాయణ అన్నారు. నెల్లిమర్లలో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ముస్లింలకు రాజ్యాంగం ఇచ్చిన మత స్వేచ్ఛను పూర్తిగా హరించడమే బిల్లు ముఖ్య ఉద్దేశమన్నారు. మత విద్వేషాలను రెచ్చగొట్టి, బోర్డు ఆస్తులను అన్యాక్రాంతం చేయడానికి కేంద్ర ప్రభుత్వం యోచిస్తోందని గంటా ఆరోపించారు. బిల్లుకు వ్యతిరేకంగా దేశ వ్యాప్తంగా పెద్ద ఎత్తున ఆందోళనలు జరుగుతున్నాయని చెప్పారు. ముస్లిం సోదరులకు మద్దతుగా జిల్లా కేంద్రం విజయనగరంలో బుధవారం నిర్వహించే ఆందోళనలో కాంగ్రెస్ పార్టీ శ్రేణులు పెద్ద ఎత్తున పాల్గొనాలని సత్యనారాయణ పిలుపునిచ్చారు.

ఎస్సీ కార్పొరేషన్ రుణాలకు దరఖాస్తు చేసుకోవాలి

నెల్లిమర్ల: నగర పంచాయతీకి చెందిన అర్హులైన ఎస్సీ నిరుద్యోగులు ఎస్సీ కార్పొరేషన్ మంజూరు చేసే రుణాల కోసం దరఖాస్తు చేసుకోవాలని కమిషనర్ కె.అప్పలరాజు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హులైన ఎస్సీ కులాలకు చెందిన నిరుద్యోగులు ఏపీఓబీఎంఎంఎస్ వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. అభ్యర్థులు తమ కుల, ఆదాయ ధ్రువపత్రాలు, రైస్‌కార్డు, బ్యాంక్ అకౌంట్ కాపీలతో వచ్చే నెల మే 10వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. వివరాలకు నగర పంచాయతీ కార్యాలయాన్ని సంప్రదించాలన్నారు.

భవన నిర్మాణాలను త్వరగా పూర్తి చేయండి

విజయనగరం ఫోర్ట్: నిర్మాణంలో ఉన్న ఆస్పత్రుల భవనాలను త్వరితగతిన పూర్తి చేయాలని డీసీహెచ్ఎస్ డాక్టర్ ఎస్.పి.పద్మశ్రీ వాణి తెలిపారు. డీసీహెచ్ఎస్ కార్యాలయంలో మంగళవారం ఇంజినీరింగ్, ఆస్పత్రుల అధికారులతో ఆమె సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఏరియా ఆస్పత్రులు, సీహెచ్‌సీల్లో బయోవేస్ట్ మేనేజ్‌మెంట్ ప్లాంట్‌లు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలన్నారు. గజపతినగరం ఏరియా ఆస్పత్రిలో వార్డులను త్వరితగతిన అందుబాటులోకి తీసుకురావాలన్నారు. అవసరమైన చోట కొత్త బోర్లు ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో ఏపీఎంఎస్ ఐడీసీ డీఈ నరేంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం



రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేస్తున్న గన్నవరపు శ్రీనివాస్

విజయనగరం టౌన్: ఆంధ్రప్రదేశ్ బ్రాహ్మణ సేవా సంఘం సమాఖ్య ఉమ్మడి విజయనగరం జిల్లా నుంచి సభ్యులు మంగళవారం ఏలూరులోని అంబికా ఫ్లావర్స్ సమావేశ మందిరంలో రాష్ట్ర నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారాలను చేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రచార కార్యదర్శిగా ప్రమాణ స్వీకారం చేసిన గన్నవరపు శ్రీనివాస్ వివరాలు వెల్లడించారు. రాష్ట్ర అధ్యక్షుడు కోనూరు సతీష్ శర్మ, కార్యదర్శి మనోహర్, అడ్వయిజరీ కమిటీ చైర్మన్ దుర్గాప్రసాద్, కోశాధికారి పులిపాక ప్రసాద్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు టీవీ శ్రీనివాస్ సమక్షంలో నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారం చేసిందన్నారు. జిల్లాకు చెందిన సభ్యులు కె.సరోజిని, యామిజాల ప్రభు, వివిఎస్ఎన్.కుమార్, వాడ్రేవు శ్రీనివాస్, రామ్‌కుమార్‌శర్మ, మురళి, కిరణ్మయి, రాపాక చంద్రశేఖర్, గంటి మోహన్ తదితరులు హర్షం వ్యక్తం చేశారు.

బీసీ సంఘం జిల్లా అధ్యక్షుడిగా అప్పలరాజు



అప్పలరాజును సత్కరిస్తున్న సభ్యులు

విజయనగరం టౌన్: జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడిగా నల్లా అప్పలరాజు నియమితులయ్యారు. ఈ మేరకు స్థానిక ప్రైవేట్ హోటల్‌లో మంగళవారం నిర్వహించిన సమావేశంలో ఆయనను సత్కరించారు. జాతీయ అధ్యక్షుడు లాకా వెంగళరావు మాట్లాడుతూ బీసీ సంక్షేమానికి కృషి చేయాలని, సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. అందుకు సభ్యులందరూ సహకరించాలన్నారు. ఆవుల నరసింగరావు, ఉల్లాకుల నీలకంఠేశ్వరరావు పాల్గొన్నారు.

వైభవంగా పాలధార మహోత్సవం



ఘటాలతో మొక్కులు చెల్లించుకుంటున్న భక్తులు



ముత్యాలమ్మ తల్లికి ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

విజయనగరం టౌన్: చల్లని తల్లి గాజులరేగ ముత్యాలమ్మ తల్లి ఆలయ 72వ వార్షికోత్సవంలో భాగంగా మంగళవారం పాలధార మహోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. రథాలు, సాము గరిడీలు, పులివేషాలు, నాగిని, కోయవేషాలు, బళ్లవేషాలు, చిత్ర విచిత్ర వేషధారణలతో, పాలధారతో భక్తులు అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. మహిళలు పసుపు, కుంకుమలను సమర్పించి మొక్కుబడులు చెల్లించుకున్నారు. రాత్రి అమ్మవారి ఘటాలతో రైల్వేస్టేషన్ వద్దనున్న పైడితల్లి అమ్మవారికి చూపించి నివేదన చేశారు. ఆలయ ప్రాంతాన్ని పుష్పాలంకరణతో తీర్చిదిద్దారు. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

ఈ-అప్రెంటీస్‌షిప్ మేళాకు విద్యార్థుల స్పందన



మాట్లాడుతున్న మేళా నిర్వాహకులు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ గిరి

విజయనగరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాల ప్రాంగణంలో ఐటీఐ విద్యార్థుల కోసం మంగళవారం నిర్వహించిన ప్రధాన మంత్రి నేషనల్ అప్రెంటిస్‌షిప్ మేళా (పీఎంఎన్ఏఎం)కు విశేష స్పందన లభించింది. ఐటీఐలోని వివిధ ట్రేడ్ కోర్సుల్లో పాసైన వివిధ ప్రాంతాల విద్యార్థులు 91 మంది హాజరయ్యారు. మైలాన్ లాపరేటరీస్, జయభేరీ ఆటోమోటివ్, శ్యాంసంగ్ అథరైజ్డ్ సర్వీస్ సెంటర్, హెచ్‌బీఎల్ ఇంజనీరింగ్ లిమిటెడ్, టైచికాస్ట్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్, బయోటెక్ లిమిటెడ్, క్యూసిప్ టెక్నాలజీస్, జాన్ సన్ లిఫ్ట్స్ ప్రైవేట్ లిమిటెడ్, కె.అలేఖ్య కంపెనీ ప్రతినిధులు ఆయా కంపెనీలలో ఖాళీగా ఉన్న 152 అప్రెంటీస్‌షిప్ సీట్లను భర్తీ చేయడానికి ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఈ సందర్భంగా మేళా నిర్వాహకులు, ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ టీవీ గిరి మాట్లాడుతూ అప్రెంటీస్ కోసం ఎంపికైన విద్యార్థులు ఆయా పరిశ్రమలలో ప్రభుత్వ ఉత్తర్వుల మేరకు తగిన స్టయిఫండ్ చెల్లించనున్నట్లు తెలిపారు. మేళా నిర్వహణలో జి.రామాచారి, ఐటీఐ సిబ్బంది పాల్గొన్నారు.

• అగ్నిమాపక సిబ్బంది మాక్ డ్రిల్



విజయనగరం జిల్లా కేంద్రంలో అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అగ్నిమాపక సిబ్బంది అగ్ని ప్రమాదాలు జరిగేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తూ రైల్వేస్టేషన్ రోడ్డు మాక్ డ్రిల్ మంగళవారం నిర్వహించారు. మాక్ డ్రిల్‌లో ప్రమాదాలు ఎలా సంభవిస్తాయి.. ఎలా నివారించవచ్చో ప్రజలకు వివరించారు. కొద్దిపాటి జాగ్రత్తలతో అగ్ని ప్రమాదాలను చాలా వరకు నివారించవచ్చని సిబ్బంది తెలిపారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, విజయనగరం

వేధింపులు భరించలేకే దాడి



వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ భవ్యారెడ్డి పక్కనే సీఐ నారాయణరావు

రామభద్రపురం: మండల కేంద్రంలో ఇటీవల మహంతి ధనంజయ అనే వ్యక్తిపై జరిగిన హత్యాయత్నం కేసులో నిందితుడు బోను అక్కునాయుడును అదుపులోకి తీసుకుని డీఎస్పీ భవ్యారెడ్డి విచారణ చేశారు. అనంతరం ఆమె.. సీఐ కె.నారాయణ రావుతో కలిసి మంగళవారం మీడియాతో విచారణ వివరాలు వెల్లడించారు. మండల కేంద్రంలో 20 సెంట్ల భూ వివాదంలో ఉంది. ఆ వివాదాస్పద భూమిలో కొంత స్థలం మండల కేంద్రానికి చెందిన అక్కునాయుడు కొనుగోలు చేసి, ఆ స్థలంలో 10 రోజుల క్రితం పండ్ల దుకాణం ఏర్పాటు చేసుకున్నాడు. అదే దుకాణం వెనకభాగంలో సిమెంట్ పోల్స్‌తో రేకుల షెడ్డు వేసుకోవడానికి ఆయన ప్రయత్నిస్తుండగా.. ధనంజయ అడ్డుకుని నిన్నెవరు ఇక్కడ దుకాణం పెట్టమన్నారు..? అని గొడవ పెట్టుకుని రెవెన్యూ అధికారులు, పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అదే భూమి విషయంలో అక్కునాయుడును ధనంజయ పదే పదే వేధిస్తుండడంతో అక్కునాయుడు మాటువేసి ధనంజయపై కత్తితో దాడికి పాల్పడినట్లు విచారణలో తెలిసిందన్నారు. ధనంజయ ఇచ్చిన ఫిర్యాదు మేరకు నిందితుడు అక్కునాయుడుపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేయడం జరుగుతోందన్నారు. ప్రస్తుతం నిదింతుడిని రిమాండ్‌కు తరలించడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ వి.ప్రసాదరావు తదితరులు ఉన్నారు.

జనాభా ఆధారంగా సచివాలయాల విభజన



సచివాలయ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌డీవో కిరణ్‌కుమార్

బొబ్బిలి రూరల్: జనాభా ఆధారంగా సచివాలయాల విభజన, సిబ్బంది సర్దుబాటు చేపడుతున్నామని డీఎల్‌డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. మండలంలోని పారాది సచివాలయాన్ని ఎంపీడీవో రవికుమార్‌తో కలిసి ఆకస్మికంగా సందర్శించిన ఆయన.. సచివాలయం ద్వారా ప్రజలకు అందిస్తున్న సేవల వివరాలపై ఆరాతీశారు. అనంతరం మనమిత్ర యాప్‌పై సిబ్బందికి అవగాహన కల్పించారు. ఈ యాప్ ద్వారా 200 పౌరసేవలు పొందవచ్చన్నారు. ఆ తర్వాత విలేకరులతో మాట్లాడిన ఆయన.. ప్రభుత్వం చేపడుతున్న రేషనలైజేషన్ ప్రక్రియలో భాగంగా డివిజన్ పరిధిలోని 127 సచివాలయాలను జనాభా ఆధారంగా విభజిస్తున్నామని, మొత్తం 60 సచివాలయాల ద్వారా సేవలందించే ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. మిగిలిన సిబ్బందిని అవసరమైన చోట నియమిస్తామన్నారు.

బాడంగి: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మనమిత్ర యాప్‌పై ఎంపీడీవో ఎస్.రామకృష్ణ మంగళవారం అవగాహన కల్పించారు. 200కు పైగా పౌరసేవలు ఈ యాప్ ద్వారా అందివ్వడం జరుగుతుందన్నారు.